## క్లుప్తంగా

### ఘనంగా వీరభద్రస్వామి జాతర



రాయకుదురులో వీరభద్రస్వామి జాతర మహోత్సవ దృశ్యం

వీరవాసరం: రాయకుదురు గరువులో వేంచేసి ఉన్న శ్రీవీరభద్ర స్వామి జాతర మహోత్సవ సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య స్వామివారి ప్రభ ఉత్సవం అత్యంత వేడుకగా జరిగింది. శూలాలు గుచ్చుకుని నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. చిన్నపిల్లలతో ఏర్పాటు చేసిన బాలదాసుల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### పోషకాహారం అందజేత



ప్రభుత్వాసుపత్రిలో పోషకాహారం అందిస్తున్న మంతెన వెంకటరామరాజు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల అభివృద్ధికి వసుధ ఫౌండేషన్ సహకారం అందిస్తుందని చైర్మన్ మంతెన వెంకటరామరాజు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తల్లీబిడ్డల వార్డులో బాలింతలకు పోషకాహారం అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్, ఫౌండేషన్ ప్రతినిధి రామకృష్ణ, బి.సుబ్బారావు, కిషోర్, బుద్ధరాజు పాల్గొన్నారు.

### ఫెన్సింగ్ పోటీలకు ఆర్ఆర్‌డీఎస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరవిందస్వామి చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల భీమవరంలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ జట్టు కోసం ఎంపిక పోటీలు నిర్వహించగా తమ కళాశాల విద్యార్థులు ఎలీషా, మనోహర్ ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను అరవిందస్వామి, కళాశాల పీడీ ఎం.శివనాగరాజు, అధ్యాపకుడు కాకుమాని శ్రీనివాసరావు అభినందించారు.

### ఘనంగా దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం



ఉల్లంపర్రులోని దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – మార్టేరు ఆర్ అండ్‌బీ రోడ్డులో ఉల్లంపర్రులోని దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు అల్లు శ్రీనివాసరావు, ఉమాదేవి దంపతులతో అర్చకులు దేవరకొండ భాస్కరశర్మ, బాదంపూడి బాల సాంబమూర్తి బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి గ్రామ, గ్రామేతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఉత్సవ కమిటీ పెద్దలు ఎంఎస్ వాసు, రావాడ సతీష్, ప్రసాద్, శ్రీ లలితా పారాయణ కమిటీ సభ్యులు, భక్తులకు సేవలందించారు.

### మహిళలకు ఎల్ఈడీ బల్బుల తయారీపై శిక్షణ

పోడూరు: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పరకాల సూర్యమోహన్ తెలిపారు. కవిటంలోని ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ఆయనతో పాటు ట్రస్ట్ కార్యదర్శి పరకాల రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ రథాంగపాణి సమావేశంలో మాట్లాడారు. మార్చి 8న గోపరాజు సీతాదేవి జ్ఞాపకార్థం వృద్ధులకు, గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు, పౌష్టికాహారం పంపిణీ చేస్తామని తెలిపారు. నెట్ క్రేకర్ ఇండియా సంస్థ సౌజన్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఎల్ఈడీ బల్బుల తయారీపై నెలరోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

# వంతు నీరు ఒడిసి పడదాం

- రబీ వరి చేలకు సాగునీటి సరఫరాపై అధికారుల నిరంతర పర్యవేక్షణ
- సాగునీటి కొరత ఉన్న కొన్ని గ్రామాల్లో ఆయకట్టుకు అదనంగా నీరు



మాదివాడలోని ఓ వరిచేలో సాగునీటి పరిమాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆకివీడు: రబీ సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. గోదావరిలో నీటి మట్టం తగ్గినప్పటికీ వంతుల వారీ నీటిని ఒడిసి పట్టి రబీలో వరి చేలకు వంతులవారీ విధానంతో సాగునీరు సక్రమంగా అందించి పంటను గట్టెక్కించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సరిపడా నీరు వంతులతో పుష్కలంగా అందుతోంది. శివారు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడితే మరో రోజు వంతును పొడిగించి పంటకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పలు చోట్ల శివారు ప్రాంతాల్లోని రైతులు ప్రధాన పంట కాల్వలో ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్నారు. వంతుల వారీ నీటిని సక్రమంగా వరి చేలకు సరఫరా అయ్యేలా మండల స్థాయిలో అధికారుల బృందం ఆయా గ్రామాల్ని పర్యవేక్షిస్తున్నారు. నీటి ఎద్దడి ఎక్కడ ఉన్నా ఆ ప్రాంతాలకు వెళ్లి సమస్యను తక్షణం పరిష్కరిస్తున్నారు. ఆకివీడు మండలంలో 4,915 వేలు ఎకరాల్లో, కాళ్ల మండలంలో 4,380 ఎకరాల్లో, ఉండి మండలంలో 10,970 ఎకరాలు, పాలకోడేరు మండలంలో 12 వేల ఎకరాల్లో రబీ సాగు ప్రస్తుతం జరుగుతోంది. ఆకివీడులోని మందపాడు, అయిభీమవరం, కుప్పనపూడి, కాళ్ల మండలంలోని కాళ్ల, ఏలూరుపాడు, పాలకోడేరు మండలంలోని మోగల్లు, కోరుకొల్లు గ్రామాల్లోనూ, ఉండి మండలంలోని చెరుకువాడ గ్రామంలో కొన్ని ఎకరాలకు మాత్రమే నీటి ఎద్దడి తలెత్తింది. ఆయా గ్రామాలను అధికారుల బృందం సందర్శించి నీటి సమస్యను పరిష్కరించారు. కూసెక్కు నీటిని 90 ఎకరాలకు సరఫరా చేసే వారు, ప్రస్తుతం వంతుల వారీ విధానంలో క్యూసెక్కు 110 ఎకరాలకు వినియోగిస్తున్నారు.

#### ఒక రోజు అదనంగా నీరు

నీటి ఎద్దడిని తట్టుకునేందుకు ఆకివీడు మండలంలో ఒక రోజు, ఉండి మండలంలో రెండు రోజులు, కాళ్ల మండలం, పాలకోడేరు మండలంలోనూ ఒక రోజు చొప్పున అదనంగా నీరు సరఫరా చేయడంతో నీటి కొరత సమస్య పరిష్కారమైంది. వంతుల వారీ నీటి విధానంతో వరి చేలకు పూర్తి స్థాయిలో నీరు సరఫరా అవుతోంది.

#### నీటి సమస్య లేకుండా చర్యలు



నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న దాఖలాలు నియోజకవర్గంలో లేవు. కాలువకు శివారు ప్రాంతంలోని కొద్దిపాటి ఎకరాలకు మాత్రమే నీరు అందడంలేదు. వంతుల నీటిని అదనంగా ఒక రోజు పెంచడంతో ఆయా గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారమైంది.

– కేపీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏడీఏ, ఆకివీడు

## డీఎన్నార్ కొత్త పాలకవర్గం ఏకగ్రీవ ఎన్నిక



గోకరాజు వెంకటనర్సింహరాజు



గాదిరాజు సత్యనారాయణరాజు

సాక్షి, భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాల నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం నామినేషన్స్ ఉపసంహరణ పూర్తి అయ్యే సమయానికి అధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఒక్కొక్కరు మాత్రమే పోటీలో ఉండగా 13 మంది గవర్నింగ్‌బాడీ పదవులకు 13 నామినేషన్లు మాత్రమే ఉండడంతో పదవులన్నీ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి కె.రఘురామ్ విలేకరులకు చెప్పారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులుగా గోకరాజు వెంకటనర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తిరిగి ఎన్నికయ్యారు. పాలకవర్గసభ్యులుగా అల్లూరి సుబ్బరాజు, కూనపరాజు రామకృష్ణంరాజు, కొత్తవెంకటశ్రీరామనారాయణ, కొత్తపల్లి శివరామరాజు, గోకరాజు పాండురంగరాజు, చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, చేకూరి శ్రీనివాసరాజు, జంపన రామలింగరాజు, నంద్యాల మదన్‌మోహన్‌లచ్చిరాజు, మంతెన వెంకటకృష్ణంరాజు, మంతెన వెంకటవిశ్వనాథ సత్యనారాయణవర్మ, ఎస్వీ సత్యనారాయణరాజు, వేగేశ్న వెంకటసత్యనాగభాస్కర బంగార్రాజు ఎన్నికైయ్యారని, నూతన కార్యవర్గం మంగవారం ప్రమాణ స్వీకారం చేస్తుందని వివరించారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భీమవరం బీవీరాజు కళాశాల పరిసరాల్లో భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బీవీరాజు కళాశాల పరిసర ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరాలను తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మాలస్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ, సత్యనారాయణ, ప్రసాద్, హనుమంతరావు, సుందరం, శ్రీరేఖ పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని పట్టుదలతో సాధించాలి



సత్యనారాయణరాజును గజమాలతో సత్కరిస్తున్న పూర్వపు విద్యార్థులు

ఆకివీడు: పట్టుదల, కృషితో లక్ష్యాన్ని సాధించుకోవాలని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. సహచర పూర్వ విద్యార్థులు స్థానిక ఐఎంఏ హాలులో ఆదివారం రాత్రి ఆయనను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలిదిండి మాట్లాడుతూ కెనరా బ్యాంక్‌లో గుమస్తాగా చేరిన తాను అంచెలంచెలుగా ఉన్నత పదవుల్ని అధిరోహించానన్నారు. ఈ పదవులు సీనియారిటీతో వచ్చినవి కాదని, ఉన్నత స్థాయిలో జరిగిన రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో నెగ్గుకొచ్చి ఈ స్థాయికి చేరినట్లు చెప్పారు. పూర్వపు విద్యార్థులు కొల్లి వెంకన్నబాబు, మాటూరి సుబ్రహ్మణ్యం, మోటుపల్లి ప్రసాద్, వాడపల్లి మోహన్, వేజెళ్ల దిలీప్, యర్రబోలు చిట్టిబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల 1981–82 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా చండీ హోమం



బొండాడ అమ్మవార్ల ఆలయం వద్ద మహా చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: బొండాడలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయం వద్ద సోమవారం మహా చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల 48వ జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ పెన్మెత్స రంగరాజు, నాగలక్ష్మి దంపతులు, భక్తులతో కె.విశ్వనాథశాస్త్రి, వేద పండితుల సమక్షంలో హోమం జరిపారు. అమ్మవార్లని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రాజకీయ ప్రముఖులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, జిల్లా సర్పంచ్ల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, గాదిరాజు వెంకట సుబ్బరాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, గోళ్ల పండు, మన్నే శ్రీనివాసరావు, కందుల హనుమ, మందపాటి రవి, ఆలయ ఈఓ వేగేశ్న ఆంజనేయరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## చేబోలు ఆశయ సాధనకు కృషి



చేబోలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ప్రజా పోరాటాల్లో అలుపెరగని సేవలందించిన చేబోలు సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ అన్నారు. చేబోలు మూడో వర్ధంతి కార్యక్రమాన్ని శృంగవృక్షంలో పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రయ మాట్లాడుతూ పాలకోడేరు, ఉండి మండలాల్లో ఎన్నో భూపోరాటాలు సత్యనారాయణ నిర్వహించారని గుర్తు చేశారు. పేదల పక్షాన నిలిచి వారి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. అలాగే ఈ ప్రాంతంలోని ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. నాయకులు లక్ష్మి, సుబ్బారావు, భోగమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శిరీష

కాళ్ల: గ్రామాల్లోని ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కాళ్ల ఎంపీపీ పెన్మెత్స శిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అభివృద్ధి అంశాలు సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సరాబు పద్మారాణి, మన్నే నాగలక్ష్మి, ఎంపీడీఓ జి.స్వాతి, తహసీల్దార్ టి.ఏ.కృష్ణారావు, ఏఓ ఎం.ఎస్. ప్రభాకరరావు, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఏఈలు రమేష్, రాంబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## సృష్టిలో మహిళల స్థానం ప్రత్యేకం





పెనుగొండలో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సర్పంచ్ సోనీ, ప్రిన్సిపాల్ అప్పారావు

పెనుగొండ: తల్లిగా, చెల్లిగా, భార్యగానే కాకుండా, సమాజాభివృద్ధిలోనూ ముందంజ వేస్తున్న మహిళకు సృష్టిలో ప్రత్యేక స్థానం ఏర్పరచుకొందని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. సోమవారం పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఫిజికల్ డిపార్ట్ మెంట్ సంయుక్తంగా మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సర్పంచ్ శ్యామలా సోనీ మాట్లాడుతూ మహిళ ప్రతి విషయంలో సమాజంలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఇంగ్లీషు విభాగాధిపతి కే శశికుమార్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనరు ఏఎస్ రమామణి, అధ్యాపకులు వి కవితాకుమారి, పీవై కృపావరం, సూపరింటెండెంట్ ఎస్ సూర్యనారాయణ, కే శ్రీలక్ష్మీ, నక్కా వేదవ్యాస శాస్త్రి, పి లక్ష్మీ కాంతమ్మ, మల్లీశ్వరి, టి దివాకర్, పి మీరయ్య, ఆర్ఎస్ శ్రీనివాసు, కే సురేష్ బాబు పాల్గొన్నారు.

## భూసర్వేతో రైతులకు మేలు



అర్తమూరులో డ్రోన్ ద్వారా భూసర్వే కొరకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూహక్కు భూరక్ష కార్యక్రమం ద్వారా ఎన్నో ఉత్తమ ఫలితాలు వెలువడుతున్నాయని రీసర్వే డీటీ కిశోర్ చెప్పారు. రీసర్వేలో భాగంగా సోమవారం అర్తమూరు, పాములపర్రు గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ రీసర్వే ద్వారా ప్రతి రైతుకు, భూయజమానులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కచ్చితమైన సరిహద్దులతో పాటు కొలతలు నిర్ధారించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రీసర్వేతో రాబోయే వందేళ్ళ వరకు ఎటువంటి భూ సమస్యలు తలెత్తవన్నారు. సర్పంచ్ గోనబోయిన వీర్రాజు, ఎంపీటీసీ సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, రామదాసు, వీఆర్వోలు ఎస్.చిన్నారావు, పీఏఎస్ శివరామకృష్ణంరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

నరసాపురం: అన్ని రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. 28వవార్డు ముసాయిదా పోలింగ్‌స్టేషన్ జాబితాను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రచురించామని చెప్పారు. దీనిపై తగు సూచనలు తీసుకునే నిమిత్తం అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## అయిభీమవరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



అయిభీమవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్

ఆకివీడు: అయిభీమవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలందించారు. డాక్టర్ గ్రామంలోకి రావడంతో పలువురు వృద్ధులు, గర్భిణులు, అంగన్‌వాడీ పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. వైద్యురాలు ఉన్నీస్సా నజిరిన్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నపిల్లల్లో బరువు తక్కువ ఉండటం గుర్తించి వారికి పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. గ్రామంలో దగ్గు, జలుబుతో ఇద్దరు, జ్వరంతో ఒకరు ఉండటంతో వారికి వైద్యం అందజేశారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో 121 మంది వైద్యం పొందారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సహకరించారు.

### ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను నిర్మించాలి

ఆకివీడు: గత ప్రభుత్వం వసతి గృహాలను నిర్వీర్యం చేసి దళితుల్ని చదువుకు దూరం చేసిందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆరోపించారు. మండలంలోని దుంపగడప గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆకివీడులో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి సువర్ణరాజు, జిల్లా కార్యదర్శి చెల్లె రాజకుమార్ పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మకు దర్బారు సేవ



కనకదుర్గమ్మను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం దర్బారు సేవ నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఇరగవరం వేద పండితులతో వేదపారాయణ, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. రాత్రి అడ్డాల ప్రసాద్ భాగ్యలక్ష్మి దంపతులతో అమ్మవారికి దర్బారు సేవ ఏర్పాటు చేశారు. ముందుగా అమ్మవారిని ఊరేగింపుగా సుబ్బారాయుడు ఆలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువెళ్లి దర్బారు సేవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ చైర్మన్ కావలి శ్రీనివాసు, సభ్యులు రేలంగి నరసింహరావు, దాశిరెడ్డి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది రాంబాబు, కాసా సత్యనారాయణ పాల్గొన్నారు.

### ప్రకృతి సైన్యం ద్వారా విరివిగా సేవలు

సాక్షి, భీమవరం: భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రకృతి సైన్యం సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ కార్యవర్గం తెలిపింది. సోమవారం గునుపూడి 11వ వార్డు రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో సంస్థ నూతన అధ్యక్షుడు గంటా పాల్‌రోనాల్డ్‌ను సత్కరించారు. అనంతరం రోనాల్డ్ మాట్లాడుతూ తమ సంస్థ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మదర్‌థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గంటా సుందరకుమార్, సాదె మహేష్, దాసరి సతీష్, కె.సన్నీ, జె.మున్నా, కె.రాము, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

### ఉద్యాన వనంలో ప్రత్యేక పూజలు

ఉండి: ఉండి రాజులపేటలో వేంచేసియున్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ఉత్తర భాగంలో శివ ఉద్యాన వనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు సన్నిధిరాజు చలపతిరావు చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు పాల్గొన్నారు. చలపతిరావు మాట్లాడుతూ జ్యోతిర్లింగాల సంబంధిత 12, నవగ్రహాల సంబంధిత 9, జన్మనక్షత్రాల సంబంధిత 27 రకాల పవిత్ర మొక్కలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సన్నిధిరాజు కృష్ణ, కిరణ్, ఫణి పాల్గొన్నారు.

### బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

కాళ్ల: దేశంలోని ప్రభుత్వ ఆస్తులను మోదీ సర్కార్ తన మిత్రులకు ధారాదత్తం చేస్తోందని కాంగ్రెస్ ఉండి ఇన్‌చార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు జువ్వలపాలెం స్టేట్ బ్యాంక్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు కొల్లి సత్యశ్రీనివాస్, బొర్రా పార్థు, సోము నాగకేశవబాబు పాల్గొన్నారు.

### స్పందనలో రెండు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ఇంటి స్థలం మంజూరు చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో వెంకట లక్ష్మీ సినిమా హాలు వెనుక ప్రాంతంలోని ఖాళీ ప్రభుత్వ భూమిలో ప్రాథమిక పాఠశాల నిర్మించాలని ఆకివీడు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి సోమరాజు సూచించినట్లు చెప్పారు.

#### దంపింగ్ యార్డు సమస్యలు పరిష్కరించాలి

ఉండి: ఉండి రాజులపేట నుండి ఉప్పుగుంట వెళ్లే రహదారిలో ఉన్న డంపింగ్‌యార్డు వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించాలని బాధితుడు రాయి సతీష్ సోమవారం భీమవరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. డంపింగ్‌యార్డు వల్ల సుమారు 10 ఎకరాల శ్మశాన స్థలం ఆక్రమణలకు గురైందన్నారు. చెత్తను ఇష్టానుసారంగా పడవేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

### బైక్ అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: దిరుసుమర్రులో ఓ ద్విచక్ర వాహనం అదృశ్యంపై సోమవారం భీమవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యారబాటి రాంబాబు గత ఏడాది నవంబర్ 20న తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లో నిద్రించాడు. తెల్లవారిన తరువాత చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో చాలా చోట్ల వాహనం కోసం వెతికినా జాడ తెలియలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాజ్యోతిబా పూలే రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–2024 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షా పద్ధతి ద్వారా 5వ తరగతిలో ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని లక్ష్మణేశ్వరం ప్రిన్సిపాల్ శైలజ సోమవారం అన్నారు. ఈ నెల 6 నుంచి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. ఇతర సమాచారం కోసం ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.